



సీతకొండ వద్ద ఫుట్‌పాత్‌పై లేచిపోయిన పలకలు

సీఎం జగన్ రాక రేపు

- సంగివలసలో నిర్వహించనున్న పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ సదస్సుకు హాజరు



విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నగరానికి రానున్నారు. భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలస వద్ద నిర్వహించే పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఇక్కడ నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతారు. ముఖ్యమంత్రి గన్నవరం నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి హెలీకాప్టర్‌లో సంగివలస వెళతారు. 3.30 గంటల నుంచి ఐదు గంటల వరకూ సమావేశంలో పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం తిరిగి హెలీకాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో విజయవాడ వెళతారు.

నేడు గణతంత్ర వేడుకలు

- పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లు
- 500మందికి ప్రశంసా పత్రాలు



పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం సాయుధ దళాల పరేడ్‌ను పరిశీలిస్తారు. ఆ తరువాత జిల్లా ప్రగతిపై మాట్లాడతారు.ఈ సందర్భంగా వివిధ శాఖల శకటాల పరేడ్, బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. జిల్లాలో ప్రభుత్వశాఖలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన సుమారు 500 మందికి ప్రశంసా పత్రాలను కలెక్టర్ ప్రదానం చేస్తారు. చివరగా సంక్షేమ శాఖల ద్వారా లబ్ధిదారులకు రుణాలు అందజేస్తారు. కాగా పరేడ్ కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లుచేయగా పోలీసులు బందోబస్తు పరిశీలించారు.

మూన్నాళ్ల ముచ్చటే...


జీ-20 సదస్సు పేరుతో గత ఏడాది రూ.130 కోట్లతో జీవీఎంసీ పనులు

- ఏడాది తిరగకుండానే బయటపడిన డొల్లతనం
- రాళ్లపై వేసిన పెయింటింగ్‌లు వెలిసిపోయిన వైనం
- దెబ్బతిన్న ఫుట్‌పాత్ టైల్స్
- పాడైపోయిన తారురోడ్డు
- వెలగని సోలార్ ట్రీ
- తుప్పల్లో చేరిన బయో రెమిడేషన్ పరికరాలు
- కొన్నిచోట్ల మినహా మిగిలినచోట్ల వెలగని సీరియల్ లైటింగ్
- పనుల్లో నాణ్యత లేకపోవడమే కారణం
- అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారని విమర్శలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గత ఏడాది జీ-20 సదస్సు కోసమంటూ మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) సుమారు రూ.130 కోట్లు వెచ్చించి అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టింది. అయితే వాటిల్లో చాలా వరకూ ఏడాది తిరగకుండానే మూలకుచేరడం/పాడైపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై, అత్యవసరం పేరుతో నాణ్యతను పట్టించుకోకుండా హడావుడిగా పనులు చేయడంతో ప్రజాధనం వృథా అయ్యిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సీతకొండ వద్ద పని చేయని సోలార్ ట్రీ

గత ఏడాది జరిగిన జీ-20 సదస్సుకు భారతదేశం ఆతిథ్యం ఇచ్చింది. ఈ సదస్సుకు సన్నాహకంగా గత ఏడాది మార్చి 20 నుంచి 22 వరకూ విశాఖలో మూడు రోజులు సదస్సు జరిగింది. ఇది ప్రతిష్ఠాత్మకమైన సదస్సు అంటూ జీవీఎంసీ అధికారులు సుమారు రూ.130 కోట్లు వెచ్చించి కొత్తగా తారురోడ్ల నిర్మాణం, మార్కింగ్, స్టడ్స్ ఏర్పాటు, రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సెంటర్ మీడియన్లు నిర్మాణం, మరమ్మతులు, పెయింటింగ్‌లు, ఖాళీ ప్రదేశాల్లో అందమైన మొక్కలు పెంపకం, రోడ్లకు ఇరువైపులా ఉన్న గోడలపై పెయింటింగ్‌లు, కూడళ్లలో సుందరీకరణ పనులు చేపట్టారు. ప్రధానంగా బీచ్‌రోడ్డులో కోస్టల్ బ్యాటరీ నుంచి రుషికొండ రాడిసన్ బ్లూహోటల్ వరకూ అనేక పనులు చేపట్టారు. సీతకొండ వద్ద వ్యూపాయింట్ పేరుతో రూ.2.3 కోట్లు ఖర్చుపెట్టారు. అక్కడ ఫొటోలు దిగేందుకు వీలుగా 'ఐ లవ్ వైజాగ్' అక్షరాలతో బోర్డు ఏర్పాటుచేశారు. తెన్నేటి పార్కు వద్ద రాళ్లపై పెయింట్‌తో బొమ్మలు వేసేందుకు రూ.28 లక్షలు ఖర్చుపెట్టారు. ఏడాది తిరగకుండానే రంగులు వెలిసిపోవడంతో బొమ్మలను పోల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. సీతకొండ వద్ద రూ.లక్షలు వెచ్చించి సోలార్ ట్రీ ఏర్పాటుచేశారు. పగలంతా సూర్యరశ్మికి చార్జింగ్ అయి, చీకటిపడగానే ఆ ట్రీకి ఉన్న లైట్లు వెలిగి సందర్శకులను ఆకట్టుకుంటుందని అధికారులు గొప్పగా చెప్పారు. కానీ ఇప్పుడు కేవలం ఒక్క లైటు మాత్రమే వెలుగుతోంది. అదేవిధంగా బీచ్‌రోడ్డులో కొత్తగా ఫుట్‌పాత్‌లు నిర్మించి వాటిపై టైల్స్‌ను అతికించారు. అయితే నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంతో టైల్స్ ఎక్కడికక్కడ ఊడిపోవడంతోపాటు కొన్నిచోట్ల ... మిగతా 6వ పేజీలో



సీతకొండ వద్ద వెలిసిపోయిన బొమ్మలు

ఇదీ... బయో రెమిడేషన్ సీన్



వృథాగా తుప్పల్లో బయో రెమిడేషన్

నగరంలోని మురుగునీరు సముద్రంలోకి చేరిపోతోంది. అది జీ-20 సదస్సుకు వచ్చే ప్రతినిధుల కంటపడకుండా అధికారులు బీచ్‌రోడ్డుకు ఇరువైపులా మురుగునీటి కాలువపై తేలియాడే మొక్కలను పెంచేందుకు 'బయో రెమిడేషన్' పేరుతో భారీగా నిధులు ఖర్చుపెట్టారు. ఈ ప్రక్రియలో పీవీసీ పైపులను కట్ చేసి వాటిల్లో ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న మొక్కలను నాటుతారు. మురుగు బయటకు కనిపించకుండా కేవలం మొక్కలు మాత్రమే కనిపించేలా కాలువపై తేలియాడేలా చేస్తారు. మొక్కలు మురుగునీటి కాలువలోని హానికరమైన వ్యర్థాలతో కూడిన నీటిని తీసుకుంటాయి కాబట్టి, సుందరీకరణతోపాటు సముద్ర జలాల కాలుష్యానికి కూడా చెక్‌పెట్టవచ్చునంటూ అధికారులు చెప్పుకొచ్చారు. తర్వాత వీటి నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో బయో రెమిడేషన్ మూన్నాళ్ల ముచ్చటగానే ముగిసిపోయింది. పైపుల్లో నాటిన మొక్కలన్నీ చనిపోవడంతో పైపులను తీసి తుప్పల్లో పడేశారు.

జీవీఎల్ టీమ్ దందా!

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నిధులతో సొంత ప్రచారం

- మొన్నటికి మొన్న రూ.5 కోట్లతో సంక్రాంతి సంబరాలు
- ఐవోసీ, హెచ్‌పీసీఎల్, ఎస్‌బీఐ, ఎల్ఐసీ నిధులతో సోకులు
- ఇప్పుడు మళ్లీ 'వైబ్రంట్ వైజాగ్' పేరిట కార్యక్రమాలు
- నేడు, రేపు రెండురోజుల పాటు నిర్వహిస్తామని ప్రకటన





ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 'జీవీఎల్ టీమ్' సంక్రాంతి సంబరాలు నిర్వహించినప్పటి చిత్రం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలని భావిస్తున్న బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎస్ నరసింహారావు కేంద్ర ప్రభుత్వ సంస్థల నిధులతో సొంత ప్రచారం చేసుకుంటున్నారు.

ఎన్నికల సమయం దగ్గర పడటంతో ప్రతి సందర్భాన్ని పండుగలా చేయడానికి యత్నిస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా 'జీవీఎల్ టీమ్'ను ఏర్పాటు చేసుకున్నారు. మొన్నటికి మొన్న 'మహా సంక్రాంతి సంబరాలు' పేరుతో జన వరి 12 నుంచి 15 వరకు ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఇదీ పార్టీ తరపున చేసింది కాదు. ప్రచారంలో తన ఫొటోలు తప్ప ఇంకెవరివీ ఉపయోగించలేదు. దీనికి సుమారుగా రూ.5కోట్ల వరకు ఖర్చయి ఉంటుందని అంచనా. ఈ నిధులన్నీ ఐవోసీ, హెచ్‌పీసీఎల్, కోరమండల్ ఫెర్టిలైజర్స్, హిందుస్థాన్ షిప్‌యార్డు, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఎల్ఐసీ తదితర సంస్థలు సమకూర్చాయి. పేదలకు ఉపయోగపడే కార్యక్రమమో, ఆసుపత్రి/పాఠశాల భవనం వంటి ప్రయోజనకరమైన నిర్మాణమో అయితే ఆయా సంస్థలు ... మిగతా 6వ పేజీలో

బీచ్ నిర్వహణ పనులకు శ్రీకారం - వార్త IIలో

- అవుటర్ హార్బర్‌లో ఇసుకను తవ్వి తీరంలో వేయనున్న డీసీఐ

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

- వచ్చే నెల ఒకటో తేదీ వరకు పరీక్షలు

నగరంలో పరీక్షలకు 20 వేల మంది విద్యార్థులు

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలు కల్పించేందుకు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. ప్రధానంగా బీఇ/బీటెక్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరవుతారు. ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరగనున్న ఈ పరీక్షలకు ఉత్తరాంధ్ర నుంచి సుమారు 20 వేల మంది హాజరవుతున్నారు. ఆర్కిటెక్చర్ కోర్సుల్లో చేరనున్న విద్యార్థులకు జేఈఈ పేపర్-2 పరీక్ష బుధవారం జరిగింది. నగరంలో చినముషిడివాడ, శీలానగర్, గాజువాక, ఎన్ఏడీ జంక్షన్‌లోని డిజిటల్ సెంటర్లను జేఈఈ మెయిన్స్ పరీక్షలకు కేంద్రాలుగా ఎంపిక చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంటన్నర ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన మార్కులను కటాఫ్‌గా తీసుకుని అడ్వాన్స్‌డ్ ప్రవేశపరీక్షకు అర్హత కల్పిస్తారు. ఎన్ఐటీతోపాటు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన మార్కులను ప్రాతిపదికగా తీసుకుంటారు. జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఇప్పటికే అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

పసి బిడ్డను ఇస్తానని మోసం

రూ.80 వేలు తీసుకొని పరారైన మహిళ
కేజీహెచ్‌లో ఘటన - వివరాలు మెయిన్‌లో

నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో టెస్ట్ మ్యాచ్ టికెట్లు విక్రయం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 25: భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో తేదీ నుంచి నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న టెస్టు మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు శుక్రవారం నుంచి ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తామని ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద శుక్రవారం నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు, పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వద్ద శుక్రవారం నుంచి ఆరో తేదీ వరకు ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు టికెట్ల విక్రయాలు జరుగుతాయన్నారు. రోజుకు రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నామని, ఆసక్తి గలవారు పాఠశాల గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

టికెట్ల ధరలివి

రోజువారీ టికెట్ల ధరలు: రూ.100, రూ.200, రూ.300, రూ.500

ఐదు రోజులకు సీజన్ టికెట్లు: రూ.400, రూ.800, రూ.1,000, రూ.1500

ఓటర్లపరంగా రాష్ట్రంలో మొదటి స్థానంలో భీమిలి

- నియోజకవర్గంలో 3,52,728 మంది ఓటర్లు
- రెండో స్థానంలో గాజువాక
- మూడు లక్షల ఓటర్లు దాటిన నాలుగు నియోజకవర్గాల్లో రెండు విశాఖపట్నం జిల్లాలోనే...



విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భీమునిపట్నం రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధిక ఓటర్లు కలిగిన సెగ్మెంట్‌గా నిలిచింది. తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం భీమిలి నియోజకవర్గంలో 3,52,728 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,72,488, మహిళలు 1,78,957, ఇతరులు 17 మంది ఉన్నారు. మరో 1,266 మంది సర్వీస్ ఓటర్లు. భీమిలి నియోజకవర్గం పరిధిలో మూడు (భీమిలి, పద్మనాభం, ఆనందపురం) గ్రామీణ మండలాలతోపాటు విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలోకి వచ్చే పోతినమల్లయ్యపాలెం, మధురవాడ, కొమ్మాది, ఎండాడ, సాగర్‌నగర్ వంటి ప్రాంతాలు ఉన్నాయి. విశాఖ నగరం మధురవాడ వైపు బాగా విస్తరించడంతో ఈ ప్రాంతంలో ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, కూలీలు అధికంగా నివాసం ఉంటున్నారు. రాష్ట్రంలో మూడు లక్షల ఓటర్లు దాటిన నియోజకవర్గాలు నాలుగు ఉండగా..అందులో రెండు విశాఖ జిల్లాలోనే ఉన్నాయి. ఇందులో భీమిలి మొదటి స్థానంలో ఉండగా, గాజువాక 3,24,441 ఓటర్లతో రెండో స్థానంలో ఉంది. కర్నూలు జిల్లా పాణ్యం 3,22,799 మందితో మూడో స్థానంలో, చంద్రగిరి 3,09,315లో నాలుగో స్థానంలో ఉన్నాయి.

ప్రభుత్వ కెమికల్ కళాశాలకు పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళం


ప్రిన్సిపాల్‌కు నగదు అందిస్తున్న నాగేంద్రకుమార్

కంచరపాలెం, జనవరి 25: తాను చదువుకున్న కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళంగా అందించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో జాజుల నాగేంద్రకుమార్ ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ కోర్సులో 2008లో డిప్లమో చేశారు. ప్రస్తుతం నగరంలో వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. కళాశాలలో ప్రయోగశాలల అభివృద్ధి, నిర్మాణం కోసం గురువారం ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణకు నగదును అందజేశారు. కార్యక్రమంలో డా.బీవీ.లక్ష్మణరావు, పీపీ విభాగాధిపతి డా.ప్రశాంతి కుమారి, డి.దామోదరం, ఎస్.వి.వి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డాబాగార్డెన్స్ మెయిన్ రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- వాహనదారులకు తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

డాబాగార్డెన్స్, జనవరి 25: జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డులోని భారీ గోతులతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. నగరానికి ముఖ్యకూడలిలో గోతులు కనిపిస్తున్నా సంబంధిత అధికారుల్లో చలనం రావడం లేదు. ఎల్‌ఐసీ సర్కిల్ చుట్టూ నిత్యం పెద్దసంఖ్యలో వాహనదారులు ప్రయాణికులు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు కూడా ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తాయి. అయినప్పటికీ గోతులను పూడ్చడం లేదు. కాగా గోతుల్లో పడి వాహనదారులు గాయాల పాలవుతున్నారు. పెద్ద ప్రమాదాలు సంభవించకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాత్రి వేళలో ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది.


ఎల్‌ఐసీ బిల్డింగ్ వెళ్లే మార్గంలో రోడ్డుపై గొయ్యి


జైలు రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా గొయ్యి

శ్రీనివాస నగర్‌లో కల్వర్టును ప్రారంభించిన మేయర్

అక్కయ్యపాలెం, జనవరి 25: గ్రేటర్ 43వ వార్డు ఎనభై అడుగుల రోడ్డు శ్రీనివాసనగర్‌లో రూ.33.50 లక్షలతో నిర్మించిన కల్వర్టును నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయమన్నారు. ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు మాట్లాడుతూ నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నాయకులు పీఎస్ నాయుడు, మౌనిక, తిరుపతి, ఎం.గోపి పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మేయర్ హరికుమారి

27వ వార్డులో శంకుస్థాపన

దొండపర్తి: గ్రేటర్ 27వ వార్డులో కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి ఆధ్వర్యంలో రూ.86 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. వార్డులో రూ.21.10లక్షలతో డైమండ్ పార్కు వద్ద బీటీ రోడ్డు, రూ.36.58 లక్షలతో శ్రీనగర్‌లో శ్మశానవాటిక అభివృద్ధి, రూ.28 లక్షలతో హిందూ ముస్లిం కాలనీలో జీప్లస్ వన్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, పీవీ రమణారావు, నీలాపు సర్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్ బే సెంటర్ ప్రారంభం.

సీతమ్మధార: గ్రేటర్ 24వ వార్డు సీఎంఆర్ సెంట్రల్ వద్ద రూ.20 లక్షలతో నిర్మించిన బస్ బేను కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో కెకె రాజు ప్రారంభించారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ఈఈ రత్నాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ఏడుగుళ్లు ముత్యాలమ్మ తీర్థం

సీతమ్మధార, జనవరి 25: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం గ్రామదేవత ఏడుగుళ్ల ముత్యాలమ్మ అమ్మవారి పరసను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరస సందర్భంగా పులివేషాలు, గరిడీ, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం, పురవీధులను విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. రాత్రి పెద్ద సంఖ్యలో బాణసంచా కల్చారు. కార్యక్రమానికి కోన గోవింద్ ఆర్థిక సహాయం అందచేశారు. భక్తులకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు బోర రవికుమార్ రెడ్డి, నక్క రమేష్ రెడ్డి, బోర శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి, కారపు శ్యామ్, వాకడ సతీష్, చిల్ల అంజిరెడ్డి ప్రసాదం పంపిణీ చేశారు.


పూజల్లో కమిటీ సభ్యులు

టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా వెంకటేశ్వరరావు

అక్కయ్యపాలెం, జనవరి 25: టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా 44వ వార్డుకు చెందిన కొయిలాడ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించినందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, దువ్వారాపు రామారావు, శ్రీభరత్, విజయ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.


వెంకటేశ్వరరావు

ముగిసిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

అక్కయ్యపాలెం, జనవరి 25: గ్రేటర్ 45వ వార్డు కైలాసపురం డీఎల్బీ మైదానంలో ఆడుదాం.. ఆంధ్రా మండలస్థాయి పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అఖిల, కటుమూరి సతీష్, డీఈ భరణి, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు నిత్యావసర సరకుల వితరణ

మురళీనగర్, జనవరి 25: గ్రేటర్ 50వ వార్డు మాధవధార మానవసేవే మాధవసేవ అసోసియేషన్ సభ్యులు గురువారం దివ్యాంగులు, అభాగ్యులకు నిత్యావసర సరకులు అందజేసినట్టు అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. మురళీనగర్ శ్రీదేవి పార్కులో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డి.ప్రసాద్ రాజు, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ అదనపు కమిషనర్‌కు ఎకో వారియర్ అవార్డు

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావుకు రాష్ట్ర ప్రభుత్వం ఎకో-వారియర్ అవార్డు ప్రకటించింది. పర్యావరణ పరిరక్షణకు పనిచేసే అధికారులకు ఈ అవార్డు అందజేస్తారు. విజయవాడలో శుక్రవారం జరిగే కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్ అవార్డుని అందిస్తారు. కార్యక్రమానికి హాజరుకావాలని గవర్నర్ కార్యాలయం నుంచి సన్యాసిరావుకు ఆహ్వానం అందింది.

12, 13 తేదీల్లో వాలీబాల్ ఎంపికలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 25: స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) రెసిడెన్షియల్ స్కీంలో భాగంగా పోర్టు స్టేడియంలోని శాయ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 12, 13 తేదీల్లో బాలికల వాలీబాల్ ప్రవేశ ఎంపికలు జరుగుతాయని సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారిణుల ఎత్తు 170 సెంటీమీటర్లకు పైగా ఉండాలని, 12 నుంచి 18 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. ఆసక్తిగలవారు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, క్రీడా ధ్రువపత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లతో ఉదయం ఆరు గంటలకు పోర్టు స్టేడియంలోని శాయ్ ట్రైనింగ్ సెంటర్‌లో హాజరుకావాలన్నారు. వివరాలకు 7046370324, 8328315767 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పర్యాటక టెండర్లు రద్దుచేయండి

- ప్రభుత్వానికి ఈఏఎస్ శర్మ లేఖ

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పర్యాటక ప్రాజెక్టులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం పీసా చట్టం ప్రకారం చెల్లదని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్.శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గురువారం లేఖ రాశారు. గిరిజన ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులు టెడర్ల ద్వారా కట్టబెట్టాలంటే గిరిజన గ్రామసభల నుంచి ముందస్తు సమ్మతి తీసుకోవాలని లేఖలో ప్రస్తావించారు. సమతా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన అంశాలను ఉల్లంఘించారన్నారు. ఈ నేపథ్యంలో టెండర్ నోటీసులు వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్

సిరిపురం, జనవరి 25: సుదీర్ఘకాలంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ విజయవాడలో ధర్నా చేసేందుకు ముందస్తు అనుమతి ఉన్నప్పటికీ విజయవాడ రాకుండా ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తూ 41ఏ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ వైఖరి తగదని, సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కె. రాంబాబు, రియాజ్, జగన్, సంతోష్, శ్రీవిద్య, వనిత, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

సీతమ్మధార, జనవరి 25: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ పిలుపునిచ్చారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో సంపదాయాలను నిలబెడతామని, ఒత్తిడులకు ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేస్తామని ఉద్యోగులతో సీఎండీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డి.చంద్ర, ఏవీవీ సూర్యప్రతాప్, సీజీఎంలు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్రప్రసాద్, డి.సుమన్‌కళ్యాణి, అచ్చి రవికుమార్, పి.శ్రీనివాస్, ఎస్.హరిబాబు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో...

డాబాగార్డెన్స్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు గురువారం ఓటరు ప్రతిజ్ఞతో పాటు అధ్యాపకులు ఓటు ప్రాధాన్యతను వివరించారు. వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన ఎస్.మహేశ్వరి ప్రథమ, డి.ప్రవల్లిక ద్వితీయ, టి.హేమగంగాకు తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.జ్యోతి, బి.నాగమణి, కేఎల్ శిరీష, ఎస్.అనురాధ, జె.లావణ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటే...

... 5వ పేజీ తరువాయి

ఫుట్‌పాత్ కిందకు కుంగిపోవడంతో నడిచే వారికి ఇబ్బందిగా తయారైంది.

జాడ లేని రూ.4 కోట్లతో ఏర్పాటుచేసిన లైటింగ్

బీచ్‌రోడ్డుతోపాటు నగరంలోని కొన్ని ప్రధాన రహదారుల మధ్యలో విద్యుత్ స్తంభాలకు, చెట్లపై రాత్రిపూట ఆకర్షనీయంగా కనిపించేందుకు సీరియల్ సెట్ల లైటింగ్ కోసం సుమారు రూ.నాలుగు కోట్లు వెచ్చించారు. బీచ్‌రోడ్డులో చెట్లపై ఏర్పాటుచేసిన సీరియల్ సెట్లు కొద్దిరోజులకే గాలికి కొట్టుకుపోయాయి. స్తంభాలకు ఏర్పాటుచేసిన లైటింగ్ రోప్‌లు కొన్నిచోట్ల మినహా చాలాచోట్ల వెలగడం లేదు. కోస్టల్ బ్యాటరీ నుంచి వుడాపార్క్ వరకూ బీచ్‌రోడ్డులో నిత్యం సందర్శకులు, అధికారులు తిరుగుతుంటారు కాబట్టి, ఆప్రాంతంలో లైటింగ్ ఆగిపోగానే అధికారులు తిరిగి వెలిగిస్తున్నా...తెన్నేటి పార్కు నుంచి రుషికొండ వరకూ బీచ్‌రోడ్డులో మాత్రం చాలాచోట్ల రోప్ లైటింగ్ మూలకు చేరింది.

వ్యూపాయింట్ వద్ద పాడైపోయిన నడకదారి

సీతకొండ వ్యూ పాయింట్ వద్ద సందర్శకులు, పర్యాటకులు నడిచేందుకు వీలుగా సముద్ర తీరం వైపు ప్రత్యేకంగా రాళ్ల పలకలతో దారి నిర్మించారు. అయితే నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో రాతి పలకలన్నీ పైకి లేచిపోయి చిందరవందరగా పడి ఉన్నాయి. ఆ మార్గంలో నడిచేవారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా సరే వాటిని తన్నుకుని కిందపడిపోయే ప్రమాదం ఉంది. అక్కడికి సమీపంలో తారురోడ్డు కూడా పాడైపోవడం పనుల్లో నాణ్యతను తెలియజేస్తోంది. అధికారులు మాత్రం ఆయా పనులన్నింటికీ ఆగమేఘాలమీద బిల్లులు చెల్లించేశారు.

జీ-20 పనులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు

జీ-20 పేరుతో చేపట్టిన రూ.130 కోట్ల విలువైన పనుల్లో భారీగా అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు అప్పట్లోనే తీవ్రస్థాయిలో ఆరోపించాయి. టెండర్లు పిలవకుండానే కొన్ని పనులను తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లతో చేయించేశారని, కొన్ని పనులకు టెండర్లు పిలిచినా వాటిని తెరవకుండానే పనులు ప్రారంభించేశారని టీడీపీ, జనసేన కార్పొరేటర్లు ఆరోపించారు. తక్కువ విలువైన పనుల అంచనాలను భారీగా పెంచేశారని, వాటిలో అధికారుల ప్రమేయం ఉందంటూ ఆధారాలతో సహా బయటపెట్టారు. అయినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.

‘జీవీఎల్ టీమ్’ దందా!

... 5వ పేజీ తరువాయి

‘సామాజిక బాధ్యత’ కింద నిధులు ఇచ్చి సహకరించాయని అనుకోవచ్చు. కానీ ‘జీవీఎల్’ పేరుతో నిర్వహించిన సంబరాలకు ఈ సంస్థలు అంత పెద్ద మొత్తాలు ఇవ్వడం వెనుక కారణాలేమిటో తెలియడం లేదు. ఈ సంబరాలు ముగిసి పట్టుమని పది రోజులు కాకుండానే ఇప్పుడు ‘రిపబ్లిక్ డే’ను పురస్కరించుకొని ‘వైబ్రెంట్ వైజాగ్’ పేరుతో బీచ్ రోడ్డులో కలర్స్ రన్ వంటి కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. శుక్ర, శనివారం రెండు రోజులు ఈ కార్యక్రమాలు ఉంటాయని ప్రకటించారు. వీటికి కూడా భారీగా నిధులు సమీకరించినట్టు సమాచారం. విశాఖపట్నంలో బీజేపీ ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. ఇప్పుడు బీజేపీ ఎంపీనే నిర్వహిస్తున్నారు కాబట్టి పార్టీ తరపున చేస్తున్నారా అంటే అదీ లేదు. ‘జీవీఎల్ టీమ్’ అని చెబుతున్నా.... నిధులు మాత్రం ప్రభుత్వ రంగ సంస్థల నుంచి తీసుకుంటున్నారు. జీవీఎల్ యూపీ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. రాబోయే ఎన్నికల్లో విశాఖ లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలనేది ఆయన ఆలోచన. దాని కోసం కొన్నాళ్లుగా విశాఖలో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వివిధ వర్గాల సమస్యలు తెలుసుకొని, పరిష్కారం చేస్తానని చెబుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటు సమస్యను కూడా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ప్రైవేటీకరణ ప్రక్రియ ఆపించేశానని ఆయన ప్రకటించడాన్ని ఉక్కు కార్మిక సంఘాలు ఖండించాయి. దీనిపై కేంద్రంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశాయి. దానికి జీవీఎల్ నుంచి ప్రతిస్పందన లేదు. 2014 ఎన్నికల్లో విశాఖ నుంచి లోక్‌సభకు బీజేపీ తరపున కంభంపాటి హరిబాబు (టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా) పోటీచేసి విజయం సాధించారు. దానిని దృష్టిలో ఉంచుకొని విశాఖలో బీజేపీకి ఆదరణ ఉందని జీవీఎల్ తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే స్థానిక నాయకుల్లో చాలామందికి ఇది నచ్చడం లేదు. అధిష్ఠానం అనుమతితోనే విశాఖ వచ్చానని ఆయన చెప్పడం, ఢిల్లీ పెద్దలు కూడా సహకరించాల్సిందిగా సూచించడంతో అయిష్టంగానే కార్యక్రమాలకు హాజరవుతున్నారు.

జన జాగరణ సమితి వినూత్న ర్యాలీ



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న జన జాగరణ సమితి సభ్యులు

సిరిపురం, జనవరి 25 : ఓటు వేయండి.. లేదా చచ్చిపోండి అంటూ జన జాగరణ సమితి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ గురువారం వినూత్నంగా ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు వినియోగించుకోకపోవడం అన్నిటి కంటే పెద్ద సామాజిక నేరమన్నారు. ఓటు హక్కు వినియోగించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసే వారు కూడా స్పందించేలా ఓటు వేయండి.. లేదా చచ్చిపోండి అన్న నినాదంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత పెద్ద ఎత్తున ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కొంతమంది రాజకీయాలపై అసహ్యంతోనూ, మరికొంతమంది ప్రభుత్వాలతో తమకు ఎటువంటి పని లేదన్న భావనతో ఓటు వేయడం లేదన్నారు.అటువంటి వారిని చైతన్యవంతులను చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ సి. సునీల్‌కుమార్, శ్రీహరికృష్ణ, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ స్టాంపులు, నాణేల ప్రదర్శన

సీతమ్మధార, జనవరి 25: సీతమ్మధార కేఆర్ఎం కాలనీ నారాయణ స్కూల్‌లో రిపబ్లిక్ డే సందర్భంగా గాంధీ స్టాంపులు, నాణేలు, గాంధీ చిత్రాల ప్రదర్శనను సుబ్రహ్మణ్యం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

పోర్టు కాలుష్యంతో మసిబారుతున్న పాత నగరం

- ఊపిరితిత్తుల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- కాలుష్య నియంత్రణపై మాట నిలబెట్టుకోని ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ కూడలి, జనవరి 25: పాతనగరం మసిబారుతోంది. శీతల గాలులు పెరగడంతో పోర్టు నుంచి వెలువడే దుమ్ము, ధూళి పాత నగరాన్ని కమ్మేస్తోంది. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలుల తీవ్రతతో పోర్టులోని పలురకాల కాలుష్యకారకాలు గాలిలో వ్యాప్తి చెంది నగరంలోని పలు ప్రాంతాలను మసి చేస్తోంది. పోర్టు దగ్గరగా ఉన్న ఏరియాల్లో గాలుల తీవ్రతతో ఇంట్లో ప్రతీ వస్తువు నల్లగా మారిపోతున్నాయని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోర్టు నుంచి వెలువడే కాలుష్యం పట్ల దక్షిణం నియోజవర్గంలోని పలు ప్రాంతవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికే పలు రకాల వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో వాటికి కాలుష్యం తోడుకావడంతో ఊపిరితిత్తులు, చర్మసంబంధ రోగాలు ప్రబలుతున్నాయని ఈ ప్రాంతీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంటికి కనిపించని నల్లని మసి ఇల్లలోకి చేరి అనారోగ్య సమస్యలకు కారణమవుతుందని వారంతా ఆవేదన చెందుతున్నారు.


పోర్టు నుంచి వెలువడుతున్న కాలుష్యం

మాట నిలబెట్టుకోని ఎమ్మెల్యే వాసుపల్లి

దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోర్టు కాలుష్యానికి పూర్తిస్థాయిలో కళ్లెం వేస్తానని స్థానికులు ఇచ్చిన హామీ ఆచరణలోకి రాలేదు. అధికార పార్టీలోకి వెళ్లిపోయినా కాలుష్యాన్ని నియంత్రించడంపై దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండో పర్యాయం గెలిచిన ఎమ్మెల్యే వాసుపల్లి దక్షిణంలోని అనేక ప్రాంతాలు మసిమసిగా మారుతున్నా దీనిపై నోరుమెదపకపోవడం గమనార్హం. వన్‌టౌన్ వాసులను ఏళ్ల తరబడి పీడిస్తున్న పోర్టు కాలుష్య సమస్యల పట్ల ఎమ్మెల్యే మౌనం వహించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నగరం ఎంత అభివృద్ధి సాధించినా పోర్టు కాలుష్యం కోరల నుంచి బయటపడే మార్గం కనిపించడం లేదని పర్యావరణ వేత్తలు కూడా అభిప్రాయపడుతున్నారు. పాతనగరంలోని కోట వీధి, పాతపోస్టాఫీసు ఏరియాతోపాటు పూర్ణామార్కెట్, వెలంపేట, ఏవీఎన్ కాలేజీ రెల్లివీధి, కేజీహెచ్ డౌన్, సాలిపేట, కుమ్మరవీధి, జగదాంబ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ద్వారకానగర్, దొండపర్తి, బీచ్‌ఏరియాల్లో పోర్టు నుంచి వెలువడే కాలుష్యం, మసి ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. ప్రజల ఇబ్బందులను స్థానిక ప్రజాప్రతినిధులు గుర్తించి, పోర్టు కాలుష్యాన్ని నియంత్రించేలా ఉన్నతాధికారులకు నివేదించాలని కోరుతున్నారు. కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని జరుపుకోవడం మినహా చర్యలు తీసుకునేందుకు అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులుగానీ ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయడం లేదని, ఫలితంగా రోగాల బారిన పడుతున్నామని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టర్పాలిన్లు కప్పుతున్నా...

పోర్టు పరిధిలోకి కాలుష్యం వాతావరణంలోకి వెదజల్లకుండా బొగ్గు, ఇతర నిల్వలపై టార్పాలిన్లు పరుస్తారు. అయితే వాటి నిర్వహణ ఇటీవల అధ్వానంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాలులకు టార్పాలిన్లు ఎగిరిపోవడం, మళ్లీ వాటిని యథా స్థితికి తేవడంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా బొగ్గు ,ఇనుప ఖనిజం తదితరాలు గిలిలో కలిసి పోయి కాలుష్యం వెదజల్లుతున్నాయి. కాలుష్య కారక ధూళి గాలిలోకి ఎగరకుండా నిత్యం నీళ్లు చల్లుతారు. అయితే ఇది కూడా సరిగ్గా లేకపోవడంతో పోర్టు కాలుష్యం కమ్మేస్తోందని స్థానికులు చెబుతున్నారు. రోడ్ల మీదకు దుమ్ము, ధూళి విపరీతంగా చేరడం, వాహనాల రాకపోకలతో తీవ్రతరంగా మారుతోందని చెబుతున్నారు. పోర్టులోని లారీ చక్రాల అడుగు భాగాన ఉన్న బొగ్గు, ధూళి పట్టేసి ఆయా వాహనాలు బయటకు వెళ్లేటపుపుడ కాలుష్యం విడుదలవుతోందని గుర్తించిన అధికారులు ట్రక్‌టైర్ వాష్ చరలు& చేపట్టారు. అయితే దీనిని నివారించే చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండాపోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోర్టు నిల్వల వల్ల నగరవాసులు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, అయినా పటిష్ట చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకులు

మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు



పెదగంట్యాడ పారిశ్రామికవాడలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు



దశాబ్ద కాలంగా వృథాగా పడి ఉన్న దిబ్బపాలెంలోని వాటర్ ట్యాంకు

పెదగంట్యాడ, జనవరి 25: జీవీఎంసీ 64వ వార్డు పరిధి పెదగంట్యాడ పారిశ్రామిక వాడలో, దిబ్బపాలెం కాలనీలో సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు మూలకు చేరాయి. వీటికి సకాలంలో మరమ్మతులు చేయకపోవడం వల్ల వీటికి కాలం చెల్లింది. చిన్నచిన్న సాంకేతిక లోపాలను సైతం ప్రాథమిక దశలోనే సవరించకపోవడంతో ఇప్పుడు వాటిని పునరుద్ధరిచడం ఇటు ఏపీఐఐసీకి గానీ అటు జీవీఎంసీ అధికారులకు కానీ అసాధ్యంగా మారింది. పెదగంట్యాడ పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు నిరంతరం నీటిని అందించేందుకు ఏపీఐఐసీ యాతపాలెం కూడలిలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును నిర్మించింది. పరిశ్రమల నిర్మాణ దశ నుంచి నాలుగేళ్ల పాటు పరిశ్రమలకు అవసరమైన నీటిని ఇది అందించింది. ఆ తర్వాత పైపు లైన్లలో సాంకేతిక లోపాలు ఏర్పడ్డాయి. అయితే సంబంధిత అధికారులు సకాలంలో దీని లోపాలను సవరించకపోవడంతో పరిశ్రమలకు నీటి కొరత ఏర్పడడం.. పారిశ్రామికవేత్తలు ప్రత్యామ్నాయంగా నీటి వనరులను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. దీంతో ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ గురించి పట్టించుకునే నాథులే కరువవ్వడంతో ఇది నిరుపయోగంగా మారింది.

అదేవిధంగా దిబ్బపాలెం కాలనీ ఏర్పాటు దశలో.. సుమారు ఇరవై ఏళ్ల క్రితం ఇక్కడ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును నిర్మించారు. దాదాపు 600 ఇళ్లకు దీని నుంచి పైపు లైన్ కనెక్షన్లు ఇచ్చారు. రెండేళ్ల పాటు కాలనీవాసులకు నిరంతరాయంగా నీటి సరఫరా జరిగింది. అయితే విద్యుత్ మోటారుకు సాంకేతిక లోపాలు తలెత్తినా మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా మునిసిపల్ కొళాయిలను ఏర్పాటు చేసుకోవడం.. అందుకు గంగవరం పోర్టు కూడా కొంత సహకరించడంతో కాలనీకి నీటి సమస్య లేకుండా పోయింది. అనంతర కాలంలో ఈ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు గురించి అధికారులు, స్థానికులు పట్టించుకోవడం మానేశారు. కాలక్రమేణా ఈ రెండు వాటర్ ట్యాంకులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఇవి నిరుపయోగంగా ఉండడంతో వీటి నిర్మాణానికి వెచ్చించిన నిధులు వృథాగా మారాయని పలువురు పేర్కొంటున్నారు. వీటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తే వేసవి సమయంలో తాగునీటి సమస్య ఎదురవ్వకుండంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



పెందుర్తి కూడలిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, తదితరులు



గాజువాకలో ర్యాలీలో పాల్గొన్న చైతన్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ప్రజాస్వామ్య హక్కు ఓటు

'పెందుర్తి' ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేష శైలజ

పలు ప్రాంతాల్లో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

పెందుర్తి, జనవరి 25: ఓటు ప్రజాస్వామ్య హక్కు అని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.శేషశైలజ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని కోరారు. పెందుర్తి నియోజకవర్గ పరిధిలో కొత్తగా 6,351 ఓటర్లు నమోదయ్యారన్నారు. అనంతరం ఓటు ఆవశ్యకతను వివరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పెందుర్తి జంక్షన్ వరకు ర్యాలీగా కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, అధికారులు చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అంతకుముందు ఓటు ఆవశ్యకత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ఈఆర్వో బహుమతులను అందజేశారు. సీనియర్ ఓటర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ జెనర్ధీ, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎన్నికల డీటీ వి.అర్జునరావు, డీటీ రంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రమహాలక్ష్మి అన్నారు. కళాశాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఎన్‌సీసీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరికీ ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. 18 ఏళ్లు నిండినవారంతా తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



'బెహరా'లో మాట్లాడుతున్న డాక్టర్ విజయచైతన్య

అగనంపూడి: ఇక్కడి గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా చైర్మన్ మోటూరి వెంకటరమణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పారదర్శక పాలన అందించే వ్యక్తులను ఎన్నుకునేందుకు ఓటు హక్కు వజ్రాయుధం వంటిదన్నారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకుని మంచి సమాజాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. స్థానిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కొలిపాక అప్పారావు, విందుల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: ప్రజాసామ్యాన్ని పరిరక్షించాలంటే ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ బెహరా విజయచైతన్య విజ్ఞప్తి చేశారు. స్థానిక బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంతో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పొందడం, ఓటును వినియోగించుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ సత్యనరసింహరాజు, నగర అధ్యక్షుడు విమలేశ్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి కామేశ్వరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: దేశంలో మార్పు ఓటు ద్వారానే సాధ్యమవుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి, ఎన్.నదియా, వి.అంజలిదేవి, ఎ.సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓటు ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: యువత ఓటు హక్కును పొందడమే కాకుండా ఓటింగ్ శాతం పెరిగేలా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. గురువారం శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతావనిలో యువతే కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం ఓటర్ నమోదు ప్రక్రియలో పాల్గొన్న సంస్థలు, ప్రతిభ చూపిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఈఆర్వోగా వ్యవహరిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జెడ్సీలు ఆర్.జి.వి.కృష్ణ, మల్లయ్యనాయుడు, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

మల్కాపురం, జనవరి 25: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కోరమాండల్ గేటు నుంచి శ్రీహరిపురం వరకు మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హార్బర్ సీఐ ఎస్.షణ్ముఖరావు ప్రారంభించి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రతిఒక్కరై వాహనాలను నడపాలని, మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

కూర్మన్నపాలెం: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం కూర్మన్నపాలెం కూడలిలో దువ్వాడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా తప్పిదాలపై ఫిర్యాదులు

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 25: తుది ఓటరు జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలపై పలువురు తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్‌కు దరఖాస్తు ఫిర్యాదు చేస్తున్నారు. ఇందులో అధికంగా తమ ఓట్లను డిలిట్ చేశారని, కొన్నిచోట్ల కుటుంబ సభ్యుల్లో కొందరికే ఓట్లు ఉన్నాయని, దీనిపై గతంలో దరఖాస్తు చేసుకున్నా ఇంకా ఓటు హక్కు రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయా అర్జీలను ఏరియాల వారిగా బీఎల్‌వోలకు పంపించి దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా ఓటు సంబంధిత పోలింగ్ కేంద్రంలో ఉందో లేదో సరిచూసుకుని అక్కడి బీఎల్‌వోల ద్వారా మళ్లీ ఓటు పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జిగా ప్రకాశ్



సింధియా, జనవరి 25: బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జిగా 62వ వార్డుకు చెందిన ములకలపల్లి ప్రకాశ్‌ను అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారికి పంచామృతాలతో అభిషేకాలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 25: షీలానగర్ ఎస్‌బీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను ఆకట్టుకుంది. శ్రీవారికి పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలు, నగలతో వేదపండితులు అలంకరించారు. సుమారు 25 కిలోల పులిహోరాను స్వామివారి ఆకారంలో అమర్చి, దానిపై పండ్లు, పువ్వులతో అలంకరించి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం నిర్వహించిన శ్రీవారి పల్లకి సేవలో ట్రస్టీలు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

శ్రీనగర్: ఇక్కడి శ్రీకృష్ణుని ఆలయ సన్నిధిలో ఉన్న రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారిని పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం, అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కె.సహదేవ్, ఎ.సూర్యనారాయణ, రాజు, పంచముఖేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'రానున్న రోజుల్లో కాంగ్రెస్‌దే విజయం'

గాజువాక, జనవరి 25: రానున్న కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే విజయమని గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. గాజువాకలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలుగా షర్మిల బాధ్యతలు చేపట్టాక గాజువాకలో చేసిన పర్యటన విజయవంతమైందన్నారు. గాజువాక ప్రజలకు, ఉక్కు కార్మిక వర్గానికి ఆమె భరోసా కల్పించారన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి అంతా నాడు కాంగ్రెస్ హయాంలోనిదేనన్నారు. నాయకులు భూలోక, అచ్చిబాబు, వర్మ, వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు డైరెక్టర్ (ఫైనాన్స్)కు అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 25: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఎంపికైన గోపాలకృష్ణ గణేశ్‌ను గురువారం పలువురు ఉక్కు అధికారులు అభినందించారు. సంస్థలో విశేష అనుభవం కలిగిన గణేశ్‌ను డైరెక్టర్ పోస్టుకు ఎంపిక చేయడం మంచి విషయమన్నారు. సంస్థను మరింత ప్రగతిపథంలో ముందుకు తీసుకువెళ్లాలని, ఇందుకు తాము పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని వారు పేర్కొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

త్రిశక్తి ఆలయంలో పౌర్ణమి పూజలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 25: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో పౌర్ణమి పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని త్రిశక్తి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో సాయంత్రం చండీ హోమం జరిపారు. అమ్మవార్ల దర్శనానికి పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో కానిరాని బీఎల్‌వోలు

మల్కాపురం, జనవరి 25: పశ్చిమ నియోజకవర్గం పరిధి మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లో ఉన్న జీవీఎంసీ పాఠశాలల్లో బూత్ లెవిల్ ఆఫీసర్‌లు (బీఎల్‌వో)లు కానరాలేదు. రెండు రోజుల పాటు బీఎల్‌వోలు పోలింగ్ స్టేషన్‌లలో ఉండి ఓటర్ల అభ్యంతరాలతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయాలి. కానీ అయా పాఠశాలల వద్ద ఒక్కరూ అందుబాటులో లేరు. కొంత మంది బీఎల్‌వోలు తొలిరోజు మొక్కుబడిగా వచ్చి పావు గంట ఉండి వెళ్లిపోయారు. రెండో రోజైతే వారి జాడే కానరాలేదు. దీంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారంతా వెనుదిరిగి వెళ్లిపోయారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే బీఎల్‌వోలు అందుబాటులో ఉండడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు అక్కిరెడ్డిపాలెం పరస

అక్కిరెడ్డిపాలెం, జనవరి 25: పారిశ్రామిక ప్రాంతంలో అతిపెద్ద తీర్థంగా పేరొందిన అక్కిరెడ్డిపాలెం కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరస శుక్రవారం జరగనున్నది. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ మైదానంలో ఉన్న కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయాల వద్ద పరసను ఏటా రిపబ్లిక్‌డే నాడు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు.

88వ వార్డులో ఉచిత వైద్య శిబిరం

కూర్మన్నపాలెం, జనవరి 25: వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్, సింహాద్రి టీఎంటీ ఆధ్వర్యంలో 88వ వార్డు గ్రీన్ సిటీ క్లబ్ హౌస్‌లో గురువారం మెగా ఈఎస్ఐ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఈఎస్ఐ, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు ప్రసాద్, రాజేశ్, ఫణీంద్ర, ప్రేమ్‌చంద్, విజయకుమార్, రమణమూర్తి, శ్రీనివాస్, రాజు, కేశవ్, వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ సురేశ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సింధియా పరిసరాల్లో కుల గణన

సింధియా, జనవరి 25: జీవీఎంసీ 40, 62, 63, వార్డులతో పాటు యారాడ ప్రాంతంలో కుల గణన కార్యక్రమం చురుగ్గా సాగుతున్నది. ఉదయం ఆరు గంటల నుంచే ఇంటింటికీ సిబ్బంది వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలతో పాటు కులం గురించి అడిగి తెలుకుంటున్నారు. అయితే చాలామందికి కుల గణనపై అవగాహన లేకపోవడంతో వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు.

విద్యార్థినికి అభినందనలు

గోపాలపట్నం, జనవరి 25: దేశ రాజధానిలో జరిగే రిపబ్లిక్ వేడుకల్లో ఏపీ శకటానికి మూడో స్థానం లభించింది. శుక్రవారం జరగనున్న శకటాల ప్రదర్శలో ఏపీ శకటంపై గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని చందు లౌఖ్య నృత్య ప్రదర్శన ఇవ్వనున్నది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం హెప్సిబా, ఉపాధ్యాయులు లౌఖ్యకు అభినందనలు తెలిపారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 25, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 48, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 16, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళదుంపలు 19, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 52, చిలగడదుంపలు 26, కంద 54, దేముడుచిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



శ్రీభరత్‌కు చేపను బహూకరిస్తున్న మత్స్యకారులు. చిత్రంలో ఎమ్మెల్యే గణబాబు తదితరులు ఉన్నారు

వైసీపీ పాలనలో బీసీల అణచివేత

టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీభరత్

గోపాలపట్నం, జనవరి 25: వైసీపీ పాలనలో బీసీలు అణచివేతకు గురయ్యారని తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీభరత్ అన్నారు. శ్రీరామ్‌నగర్‌లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీభరత్ మాట్లాడుతూ బీసీల అణచివేతే లక్ష్యంగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందన్నారు. వృత్తి పనులు చేసుకునే బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. గణబాబు మాట్లాడుతూ బీసీల ఓట్లతో గెలుపొందిన సీఎం జగన్ వారికి ఏ రంగంలోనూ సముచితమైన స్థానం కల్పించలేదన్నారు. బీసీలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా రాష్ట్రంలో చట్టబద్ధత లేని కులగణన చేపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా 89, 90, 91, 92 వార్డుల్లోని బీసీ కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి అంగ దుర్గాప్రశాంతి, 90వ కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నాయకులు బొడ్డేటి విజయకుమార్, సోములు, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద విస్తృత తనిఖీలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 25: గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉక్కు సీఐఎస్ఎఫ్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ ప్రధాన గేటు, విస్తరణ గేటు, అప్పికొండ గేటు, బీసీ గేటు వద్ద అదనపు సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించారు. ప్లాంట్‌లోకి వెళ్లే ప్రతి ఒక్కరిని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే ప్లాంట్‌లోకి అనుమతించారు. అదేవిధంగా ప్లాంట్‌లో ప్రతి విభాగం వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సీఐఎస్ఎఫ్ అధికారులకు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు సూచించారు.

ఉక్కు కార్మికుల వేతనాల అంశాన్ని తేల్చాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 25: స్టీల్‌ప్లాంట్ కార్మికులు పేర్కొన్న వేతన సవరణ అంశాన్ని తేల్చాలని కేంద్ర కార్మికశాఖ ప్రాంతీయ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) కేజే మెహంతి ఉక్కు యాజమాన్యానికి సూచించారు. ఉక్కు యాజమన్యాం, కార్మిక సంఘ నాయకులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఉక్కు అధికారులు లాభాలు వచ్చాక ఉక్కు మంత్రిత్వశాఖ ఆమోదంతో వేతన సవరణ చేస్తామని లిఖితపూర్వకంగా తెలిపారు. అయితే అందుకు కార్మిక సంఘ నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఉక్కు యాజమాన్యానికి పలు అంశాలపై ఆర్ఎల్‌సీ పలు సూచనలు చేశారు. సమ్మెను వాయిదా వేసినట్టు కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉక్కు జీఎం సంజీవరావు, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, రామస్వామి, పరంధామయ్య,రామ్మోహన్‌కుమార్, నాయుడు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి'

మల్కాపురం, జనవరి 25: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని, అందువల్ల రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఓటు అనే ఆయుధంతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పి.జయరాజు కోరారు. శ్రీహరిపురంలో టీడీపీ సీనియర్ నాయకులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా అందరూ పనిచేయాలన్నారు. జగన్ పాలనలో ధరలు బాగా పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు వి.సన్యాసిరావు, బి.సూర్యప్రకాశ్, డి.అప్పలరాజు, వెంకటేశ్వరరావు, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

గాజువాక, జనవరి 25: ప్రజలం దరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలో ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి పేదవాడు సుఖమైన జీవనంతో ముందుకు సాగాలన్న సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలను కేంద్రం ప్రవేశపెడుతుందన్నారు. అయితే కేంద్ర పథకాలను రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం తమవిగా చెపుకుంటూ గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. నాయకులు రోహిణి, నాగేశ్వరరావు, రామస్వామి, అప్పారావు, దాసు, దేముడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

పెందుర్తి, జనవరి 25: ఎన్నికల సమయం ఆసన్నమవుతున్న తరుణంలో పెందుర్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జోరందుకున్నాయి. ఇందులో భాగంగా గురువారం పెందుర్తి గ్రామీణ ప్రాంతాల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సుడిగాలి పర్యటన చేసి రూ 4.25 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గొరపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే పినగాడి, పెదగాడి, పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, సచివాలయ భవనం వంటి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీపీ ఎం.నాగమణి, సర్పంచ్ జి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కెమికల్ కళాశాలకు పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళం



ప్రిన్సిపాల్‌కు నగదు అందిస్తున్న నాగేంద్రకుమార్

కంచరపాలెం, జనవరి 25: తాను చదువుకున్న కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళంగా అందించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో జాజుల నాగేంద్రకుమార్ ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ కోర్సులో 2008లో డిప్లమో చేశారు. ప్రస్తుతం నగరంలో వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. కళాశాలలో ప్రయోగశాలల అభివృద్ధి, నిర్మాణం కోసం గురువారం ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణకు నగదును అందజేశారు. కార్యక్రమంలో డా.బీవీ.లక్ష్మణరావు, పీపీ విభాగాధిపతి డా.ప్రశాంతి కుమారి, డి.దామోదరం, ఎస్.వి.వి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డాబాగార్డెన్స్ మెయిన్ రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- వాహనదారులకు తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

డాబాగార్డెన్స్, జనవరి 25: జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డులోని భారీ గోతులతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. నగరానికి ముఖ్యకూడలిలో గోతులు కనిపిస్తున్నా సంబంధిత అధికారుల్లో చలనం రావడం లేదు. ఎల్ఐసీ సర్కిల్ చుట్టూ నిత్యం పెద్దసంఖ్యలో వాహనదారులు ప్రయాణికులు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు కూడా ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తాయి. అయినప్పటికీ గోతులను పూడ్చడం లేదు. కాగా గోతుల్లో పడి వాహనదారులు గాయాల పాలవుతున్నారు. పెద్ద ప్రమాదాలు సంభవించకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాత్రి వేళలో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతోంది.



ఎల్ఐసీ బిల్డింగ్ వెళ్లే మార్గంలో రోడ్డుపై గొయ్యి



జైలు రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా గొయ్యి

శ్రీనివాస నగర్‌లో కల్వర్టును ప్రారంభించిన మేయర్

అక్కయ్యపాలెం, జనవరి 25: గ్రేటర్ 43వ వార్డు ఎనభై అడుగుల రోడ్డు శ్రీనివాసనగర్‌లో రూ.33.50 లక్షలతో నిర్మించిన కల్వర్టును నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయమన్నారు. ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు మాట్లాడుతూ నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నాయకులు పీఎస్ నాయుడు, మౌనిక, తిరుపతి, ఎం.గోపి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మేయర్ హరికుమారి

27వ వార్డులో శంకుస్థాపన

దొండపర్తి: గ్రేటర్ 27వ వార్డులో కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి ఆధ్వర్యంలో రూ.86 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. వార్డులో రూ.21.10లక్షలతో డైమండ్ పార్కు వద్ద బీటీ రోడ్డు, రూ.36.58 లక్షలతో శ్రీనగర్‌లో శ్మశానవాటిక అభివృద్ధి, రూ.28 లక్షలతో హిందూ ముస్లిం కాలనీలో జీప్లస్ వన్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, పీవీ రమణారావు, నీలాపు సర్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్ బే సెంటర్ పారంభం.

సీతమ్మధార: గ్రేటర్ 24వ వార్డు సీఎంఆర్ సెంట్రల్ వద్ద రూ.20 లక్షలతో నిర్మించిన బస్ బేను కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో కెకె రాజు ప్రారంభించారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ఈఈ రత్నాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ఏడుగుళ్లు ముత్యాలమ్మ తీర్థం



పూజల్లో కమిటీ సభ్యులు

సీతమ్మధార, జనవరి 25: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం గ్రామదేవత ఏడుగుళ్లు ముత్యాలమ్మ అమ్మవారి పరసను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరస సందర్భంగా పులివేషాలు, గరిడీ, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం, పురవీధులను విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. రాత్రి పెద్ద సంఖ్యలో బాణసంచా కల్చారు. కార్యక్రమానికి కోన గోవింద్ ఆర్థిక సహాయం అందచేశారు. భక్తులకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు బోర రవికుమార్ రెడ్డి, నక్క రమేష్ రెడ్డి, బోర శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి, కారపు శ్యామ్, వాకద సతీష్ చిల్ల అంజిరెడ్డి ప్రసాదం పంపిణీ చేశారు.

టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావు

అక్కయ్యపాలెం, జనవరి 25: టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా 44వ వార్డుకు చెందిన కొయిలాడ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించినందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, దువ్వారాపు రామారావు, శ్రీభరత్, విజయ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

అక్కయ్యపాలెం, జనవరి 25: గ్రేటర్ 45వ వార్డు కైలాసపురం డీఎల్బీ మైదానంలో ఆడుదాం.. ఆంధ్రా మండలస్థాయి పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అఖిల, కటుమూరి సతీష్, డీఈ భరణి, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు నిత్యావసర సరకుల వితరణ

మురళీనగర్, జనవరి 25: గ్రేటర్ 50వ వార్డు మాధవధార మానవసేవే మాధవసేవ అసోసియేషన్ సభ్యులు గురువారం దివ్యాంగులు, అభాగ్యులకు నిత్యావసర సరకులు అందజేసినట్టు అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. మురళీనగర్ శ్రీదేవి పార్కులో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డి.ప్రసాద్ రాజు, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ అదనపు కమిషనర్‌కు ఎకో వారియర్ అవార్డు

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావుకు రాష్ట్ర ప్రభుత్వం ఎకో-వారియర్ అవార్డు ప్రకటించింది. పర్యావరణ పరిరక్షణకు పనిచేసే అధికారులకు ఈ అవార్డు అందజేస్తారు. విజయవాడలో శుక్రవారం జరిగే కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్ అవార్డుని అందిస్తారు. కార్యక్రమానికి హాజరుకావాలని గవర్నర్ కార్యాలయం నుంచి సన్యాసిరావుకు ఆహ్వానం అందింది.

12, 13 తేదీల్లో వాలీబాల్ ఎంపికలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 25: స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) రెసిడెన్షియల్ స్కీంలో భాగంగా పోర్టు స్టేడియంలోని శాయ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 12, 13 తేదీల్లో బాలికల వాలీబాల్ ప్రవేశ ఎంపికలు జరుగుతాయని సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారిణుల ఎత్తు 170 సెంటీమీటర్లకు పైగా ఉండాలని, 12 నుంచి 18 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. ఆసక్తిగలవారు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, క్రీడా ధ్రువపత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లతో ఉదయం ఆరు గంటలకు పోర్టు స్టేడియంలోని శాయ్ ట్రైనింగ్ సెంటర్‌లో హాజరుకావాలన్నారు. వివరాలకు 7046370324, 8328315767 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పర్యాటక టెండర్లు రద్దుచేయండి

- ప్రభుత్వానికి ఈఏఎస్ శర్మ లేఖ

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పర్యాటక ప్రాజెక్టులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం పీసా చట్టం ప్రకారం చెల్లదని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్.శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గురువారం లేఖ రాశారు. గిరిజన ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులు టెడర్ల ద్వారా కట్టబెట్టాలంటే గిరిజన గ్రామసభల నుంచి ముందస్తు సమ్మతి తీసుకోవాలని లేఖలో ప్రస్తావించారు. సమతా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన అంశాలను ఉల్లంఘించారన్నారు. ఈ నేపథ్యంలో టెండర్ నోటీసులు వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్

సిరిపురం, జనవరి 25: సుదీర్ఘకాలంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ విజయవాడలో ధర్నా చేసేందుకు ముందస్తు అనుమతి ఉన్నప్పటికీ విజయవాడ రాకుండా ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తూ 41ఏ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ వైఖరి తగదని, సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కె. రాంబాబు, రియాజ్, జగన్, సంతోష్, శ్రీవిద్య, వనిత, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

సీతమ్మధార, జనవరి 25: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ పిలుపునిచ్చారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో సంపదాయాలను నిలబెడతామని, ఒత్తిడులకు ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేస్తామని ఉద్యోగులతో సీఎండీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డి.చంద్ర, ఏవీవీ సూర్యప్రతాప్, సీజీఎంలు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్రప్రసాద్, డి.సుమన్‌కళ్యాణి, అచ్చి రవికుమార్, పి.శ్రీనివాస్, ఎస్.హరిబాబు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో...

డాబాగార్డెన్స్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు గురువారం ఓటరు ప్రతిజ్ఞతో పాటు అధ్యాపకులు ఓటు ప్రాధాన్యతను వివరించారు. వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన ఎస్.మహేశ్వరి ప్రథమ, డి.ప్రవల్లిక ద్వితీయ, టి.హేమగంగాకు తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.జ్యోతి, బి.నాగమణి, కేఎల్ శిరీష, ఎస్.అనురాధ, జె.లావణ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటే...

... 5వ పేజీ తరువాయి

ఫుట్‌పాత్ కిందకు కుంగిపోవడంతో నడిచే వారికి ఇబ్బందిగా తయారైంది.

జాడ లేని రూ.4 కోట్లతో ఏర్పాటుచేసిన లైటింగ్

బీచ్‌రోడ్డుతోపాటు నగరంలోని కొన్ని ప్రధాన రహదారుల మధ్యలో విద్యుత్ స్తంభాలకు, చెట్లపై రాత్రిపూట ఆకర్షణీయంగా కనిపించేందుకు సీరియల్ సెట్ల లైటింగ్ కోసం సుమారు రూ.నాలుగు కోట్లు వెచ్చించారు. బీచ్‌రోడ్డులో చెట్లపై ఏర్పాటుచేసిన సీరియల్ సెట్లు కొద్దిరోజులకే గాలికి కొట్టుకుపోయాయి. స్తంభాలకు ఏర్పాటుచేసిన లైటింగ్ రోప్‌లు కొన్నిచోట్ల మినహా చాలాచోట్ల వెలగడం లేదు. కోస్టల్ బ్యాటరీ నుంచి వుడాపార్క్ వరకూ బీచ్‌రోడ్డులో నిత్యం సందర్శకులు, అధికారులు తిరుగుతుంటారు కాబట్టి, ఆప్రాంతంలో లైటింగ్ ఆగిపోగానే అధికారులు తిరిగి వెలిగిస్తున్నా...తెన్నేటి పార్కు నుంచి రుషికొండ వరకూ బీచ్‌రోడ్డులో మాత్రం చాలాచోట్ల రోప్ లైటింగ్ మూలకు చేరింది.

వ్యూపాయింట్ వద్ద పాడైపోయిన నడకదారి

సీతకొండ వ్యూ పాయింట్ వద్ద సందర్శకులు, పర్యాటకులు నడిచేందుకు వీలుగా సముద్ర తీరం వైపు ప్రత్యేకంగా రాళ్ల పలకలతో దారి నిర్మించారు. అయితే నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో రాతి పలకలన్నీ పైకి లేచిపోయి చిందరవందరగా పడి ఉన్నాయి. ఆ మార్గంలో నడిచేవారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా సరే వాటిని తన్నుకుని కిందపడిపోయే ప్రమాదం ఉంది. అక్కడికి సమీపంలో తారురోడ్డు కూడా పాడైపోవడం పనుల్లో నాణ్యతను తెలియజేస్తోంది. అధికారులు మాత్రం ఆయా పనులన్నింటికీ ఆగమేఘాలమీద బిల్లులు చెల్లించేశారు.

జీ-20 పనులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు

జీ-20 పేరుతో చేపట్టిన రూ.130 కోట్ల విలువైన పనుల్లో భారీగా అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు అప్పట్లోనే తీవ్రస్థాయిలో ఆరోపించాయి. టెండర్లు పిలవకుండానే కొన్ని పనులను తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లతో చేయించేశారని, కొన్ని పనులకు టెండర్లు పిలిచినా వాటిని తెరవకుండానే పనులు ప్రారంభించేశారని టీడీపీ, జనసేన కార్పొరేటర్లు ఆరోపించారు. తక్కువ విలువైన పనుల అంచనాలను భారీగా పెంచేశారని, వాటిలో అధికారుల ప్రమేయం ఉందంటూ ఆధారాలతో సహా బయటపెట్టారు. అయినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.

'జీవీఎల్ టీమ్' దందా!

... 5వ పేజీ తరువాయి

'సామాజిక బాధ్యత' కింద నిధులు ఇచ్చి సహకరించాయని అనుకోవచ్చు. కానీ 'జీవీఎల్' పేరుతో నిర్వహించిన సంబరాలకు ఈ సంస్థలు అంత పెద్ద మొత్తాలు ఇవ్వడం వెనుక కారణాలేమిటో తెలియడం లేదు. ఈ సంబరాలు ముగిసి పట్టుమని పది రోజులు కాకుండానే ఇప్పుడు 'రిపబ్లిక్ డే'ను పురస్కరించుకొని 'వైబ్రెంట్ వైజాగ్' పేరుతో బీచ్ రోడ్డులో కలర్స్ రన్ వంటి కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. శుక్ర, శనివారం రెండు రోజులు ఈ కార్యక్రమాలు ఉంటాయని ప్రకటించారు. వీటికి కూడా భారీగా నిధులు సమీకరించినట్టు సమాచారం. విశాఖపట్నంలో బీజేపీ ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. ఇప్పుడు బీజేపీ ఎంపీనే నిర్వహిస్తున్నారు కాబట్టి పార్టీ తరపున చేస్తున్నారా అంటే అదీ లేదు. 'జీవీఎల్ టీమ్' అని చెబుతున్నా.... నిధులు మాత్రం ప్రభుత్వ రంగ సంస్థల నుంచి తీసుకుంటున్నారు. జీవీఎల్ యూపీ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. రాబోయే ఎన్నికల్లో విశాఖ లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలనేది ఆయన ఆలోచన. దాని కోసం కొన్నాళ్లుగా విశాఖలో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వివిధ వర్గాల సమస్యలు తెలుసుకొని, పరిష్కారం చేస్తానని చెబుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటు సమస్యను కూడా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ప్రైవేటీకరణ ప్రక్రియ ఆపించేశానని ఆయన ప్రకటించడాన్ని ఉక్కు కార్మిక సంఘాలు ఖండించాయి. దీనిపై కేంద్రంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశాయి. దానికి జీవీఎల్ నుంచి ప్రతిస్పందన లేదు. 2014 ఎన్నికల్లో విశాఖ నుంచి లోక్‌సభకు బీజేపీ తరఫున కంభంపాటి హరిబాబు (టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా) పోటీచేసి విజయం సాధించారు. దానిని దృష్టిలో ఉంచుకొని విశాఖలో బీజేపీకి ఆదరణ ఉందని జీవీఎల్ తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే స్థానిక నాయకుల్లో చాలామందికి ఇది నచ్చడం లేదు. అధిష్ఠానం అనుమతితోనే విశాఖ వచ్చానని ఆయన చెప్పడం, ఢిల్లీ పెద్దలు కూడా సహకరించాల్సిందిగా సూచించడంతో అయిష్టంగానే కార్యక్రమాలకు హాజరవుతున్నారు.

జన జాగరణ సమితి వినూత్న ర్యాలీ



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న జన జాగరణ సమితి సభ్యులు

సిరిపురం, జనవరి 25 : ఓటు వేయండి.. లేదా చచ్చిపోండి అంటూ జన జాగరణ సమితి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ గురువారం వినూత్నంగా ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు వినియోగించుకోకపోవడం అన్నిటి కంటే పెద్ద సామాజిక నేరమన్నారు. ఓటు హక్కు వినియోగించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసే వారు కూడా స్పందించేలా ఓటు వేయండి.. లేదా చచ్చిపోండి అన్న నినాదంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత పెద్ద ఎత్తున ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కొంతమంది రాజకీయాలపై అసహ్యంతోనూ, మరికొంతమంది ప్రభుత్వాలతో తమకు ఎటువంటి పని లేదన్న భావనతో ఓటు వేయడం లేదన్నారు.అటువంటి వారిని చైతన్యవంతులను చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ సి. సునీల్‌కుమార్, శ్రీహరికృష్ణ, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ స్టాంపులు, నాణేల ప్రదర్శన

సీతమ్మధార, జనవరి 25: సీతమ్మధార కేఆర్ఎం కాలనీ నారాయణ స్కూల్‌లో రిపబ్లిక్ డే సందర్భంగా గాంధీ స్టాంపులు, నాణేలు, గాంధీ చిత్రాల ప్రదర్శనను సుబ్రహ్మణ్యం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.


పోర్టు కాలుష్యంతో మసిబారుతున్న పాత నగరం

- ఊపిరితిత్తుల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- కాలుష్య నియంత్రణపై మాట నిలబెట్టుకోని ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ కూడలి, జనవరి 25: పాతనగరం మసిబారుతోంది. శీతల గాలులు పెరగడంతో పోర్టు నుంచి వెలువడే దుమ్ము, ధూళి పాత నగరాన్ని కమ్మేస్తోంది. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలుల తీవ్రతతో పోర్టులోని పలురకాల కాలుష్యకారకాలు గాలిలో వ్యాప్తి చెంది నగరంలోని పలు ప్రాంతాలను మసి చేస్తోంది. పోర్టు దగ్గరగా ఉన్న ఏరియాల్లో గాలుల తీవ్రతతో ఇంట్లో ప్రతీ వస్తువు నల్లగా మారిపోతున్నాయని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోర్టు నుంచి వెలువడే కాలుష్యం పట్ల దక్షిణం నియోజవర్గంలోని పలు ప్రాంతవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికే పలు రకాల వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో వాటికి కాలుష్యం తోడుకావడంతో ఊపిరితిత్తులు, చర్మసంబంధ రోగాలు ప్రబలుతున్నాయని ఈ ప్రాంతీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంటికి కనిపించని నల్లని మసి ఇల్లలోకి చేరి అనారోగ్య సమస్యలకు కారణమవుతుందని వారంతా ఆవేదన చెందుతున్నారు.

మాట నిలబెట్టుకోని ఎమ్మెల్యే వాసుపల్లి

దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోర్టు కాలుష్యానికి పూర్తిస్థాయిలో కళ్లెం వేస్తానని స్థానికులు ఇచ్చిన హామీ ఆచరణలోకి రాలేదు. అధికార పార్టీలోకి వెళ్లిపోయినా కాలుష్యాన్ని నియంత్రించడంపై దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండో పర్యాయం గెలిచిన ఎమ్మెల్యే వాసుపల్లి దక్షిణంలోని అనేక ప్రాంతాలు మసిమసిగా మారుతున్నా దీనిపై నోరుమెదపకపోవడం గమనార్హం. వన్‌టౌన్ వాసులను ఏళ్ల తరబడి పీడిస్తున్న పోర్టు కాలుష్య సమస్యల పట్ల ఎమ్మెల్యే మౌనం వహించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నగరం ఎంత అభివృద్ధి సాధించినా పోర్టు కాలుష్యం కోరల నుంచి బయటపడే మార్గం కనిపించడం లేదని పర్యావరణ వేత్తలు కూడా అభిప్రాయపడుతున్నారు. పాతనగరంలోని కోట వీధి, పాతపోస్టాఫీసు ఏరియాతోపాటు పూర్ణామార్కెట్, వెలంపేట, ఏవీఎన్ కాలేజీ రెల్లివీధి, కేజీహెచ్ డౌన్, సాలిపేట, కుమ్మరవీధి, జగదాంబ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ద్వారకానగర్, దొండపర్తి, బీచ్‌ఏరియాల్లో పోర్టు నుంచి వెలువడే కాలుష్యం, మసి ఇళ్ళలోకి వచ్చి చేరుతోంది. ప్రజల ఇబ్బందులను స్థానిక ప్రజాప్రతినిధులు గుర్తించి, పోర్టు కాలుష్యాన్ని నియంత్రించేలా ఉన్నతాధికారులకు నివేదించాలని కోరుతున్నారు. కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని జరుపుకోవడం మినహా చర్యలు తీసుకునేందుకు అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులుగానీ ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయడం లేదని, ఫలితంగా రోగాల బారిన పడుతున్నామని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పోర్టు నుంచి వెలువడుతున్న కాలుష్యం

టర్పాలిన్లు కప్పుతున్నా...

పోర్టు పరిధిలోకి కాలుష్యం వాతావరణంలోకి వెదజల్లకుండా బొగ్గు, ఇతర నిల్వలపై టార్పాలిన్లు పరుస్తారు. అయితే వాటి నిర్వహణ ఇటీవల అధ్వానంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాలులకు టార్పాలిన్లు ఎగిరిపోవడం, మళ్లీ వాటిని యథా స్థితికి తేవడంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా బొగ్గు ,ఇనుప ఖనిజం తదితరాలు గిలిలో కలిసి పోయి కాలుష్యం వెదజల్లుతున్నాయి. కాలుష్య కారక ధూళి గాలిలోకి ఎగరకుండా నిత్యం నీళ్లు చల్లుతారు. అయితే ఇది కూడా సరిగ్గా లేకపోవడంతో పోర్టు కాలుష్యం కమ్మేస్తోందని స్థానికులు చెబుతున్నారు. రోడ్ల మీదకు దుమ్ము, ధూళి విపరీతంగా చేరడం, వాహనాల రాకపోకలతో తీవ్రతరంగా మారుతోందని చెబుతున్నారు. పోర్టులోని లారీ చక్రాల అడుగు భాగాన ఉన్న బొగ్గు, ధూళి పట్టేసి ఆయా వాహనాలు బయటకు వెళ్లేటపుపుడ కాలుష్యం విడుదలవుతోందని గుర్తించిన అధికారులు ట్రక్‌టైర్ వాష్ చరలు& చేపట్టారు. అయితే దీనిని నివారించే చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండాపోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోర్టు నిల్వల వల్ల నగరవాసులు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, అయినా పటిష్ఠ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

'వ్యాపారులకు న్యాయం చేయాలి'

ఎంవీపీ కాలనీ, జనవరి 25 : అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత తొలగించిన బడ్డీల స్థానంలో వ్యాపారులకు మళ్లీ అక్కడే స్థలం కేటాయించాలని టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఉషోదయ కూడలి వద్ద పోలీసు బందోబస్తుతో జీవీఎంసీ అధికారులు బడ్డీలు తొలగించిన విషయం తెలిసిందే. ఈమేరకు గురువారం ఆయా పార్టీల నాయకులు విలేకరులతో మాట్లాడారు. న్యాయస్థానంలో కేసు ఉన్నా, జీవీఎంసీ ఏకపక్షంగా బడ్డీలను తొలగించిందని ఆరోపించారు. బడ్డీలు తొలగించేటప్పుడు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయామని, ఒక్కో బడ్డీకి రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకూ ఖర్చయ్యిందన్నారు. అవి ఇప్పుడు పూర్తిగా పాడయ్యాయని చెప్పారు. అధికారులు నష్టపరిహారం చెల్లించి, వ్యాపారులను ఆదుకోవడంతో పాటు తాత్కాలికంగా మరోచోట స్థలం కేటాయించాలని కోరారు. సమావేశంలో జనసేన నాయకుడు శ్రీనివాస పట్నాయక్, కార్మిక నాయకుడు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జనవరి 25 : వరాహలక్ష్మీనృసింహస్వామికి స్వర్ణపుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున బంగారు సంపెంగలతో స్వామిని అర్చించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రాము

ఆనందపురం, జనవరి 25 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆనందపురం గ్రామానికి చెందిన అంగటి రాము నియామితులయ్యారు. ఈమేరకు గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి : ఎంపీ

వెంకోజీపాలెం, జనవరి 25 : ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి వైసీపీతోనే సాధ్యమని ఎంపీ, వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన 17వ వార్డులోని వెంకోజీపాలెం, ఇందిరా నగర్ ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గేదెల లావణ్య, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, రాష్ట్ర మత్స్యకార చైర్మన్ పేర్ల విజయచంద్ర, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, మైనార్టీ నాయకులు ఫరూకి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ జోషిలా, పీల ప్రేమ్ కిరణ్ పాల్గొన్నారు.

శొంఠ్యాంలో సబ్ పోస్టాఫీసు ప్రారంభం

ఆనందపురం, జనవరి 25 : మండలంలోని శొంఠ్యాం గ్రామ బ్రాంచ్ తపాలా కార్యాలయం సబ్ పోస్టాఫీసుగా అప్‌గ్రేడ్ అయ్యింది. గురువారం ఈ కార్యాలయాన్ని విశాఖ డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ పి. విక్రమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా కార్యాలయం ద్వారా అందిస్తున్న సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు,నాయకులు మజ్జి వెంకటరావు, పొంద్రంకి శ్రీను, సర్పంచ్ లెంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23,టమాటా 25, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 48, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 16, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 120, బరబటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 52, చిలగడదుంపలు 26 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



రహదారి మధ్యలో ఉన్న శిలాఫలకం



గందరగోళంగా ఉషోదయ కూడలి

అసంపూర్తి పనులతో అవస్థలు

▸ ఉషోదయ కూడలిలో సగం సగం పనులు

ఎంవీపీ కాలనీ, జనవరి 25 : రెండు పనులు ఉంటే ఓ ప్రణాళిక ప్రకారం వెళ్లాలి. కానీ జీవీఎంసీ అధికారులు ఒక్కో పని ఒక్కోసారి చేసుకుంటూ వెళతారు. ఖర్చు తడిపిమోపుడైనా సరే, ప్రజల సొమ్మే కాబట్టి అలానే చేస్తారు. ఇందుకు ఉషోదయ కూడలిలో జరుగుతున్న పనులే ఉదాహరణ. కొద్దిరోజుల క్రితం ఈ కూడలిని స్మార్ట్ సిటీలో భాగంగా సుందరీకరించారు. అంతవరకూ ఉన్న సత్యసాయి స్థూపాన్ని తొలగించి, ఆ స్థానంలో వాటర్ ఫౌంటెన్ నిర్మిస్తున్నారు. ఇంకా ఇక్కడ చేయాల్సిన పనులు చాలానే ఉన్నప్పటికీ రోడ్డు నిర్మించేశారు. మరోవైపు అధికారులు చేసిన పనికి ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. ఉషోదయ కూడలి నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే మార్గం మూడుగా కనిపిస్తుంది. డివైడరుకు ఒకవైపు ఓ రోడ్డు, రెండో వైపు మరో రోడ్డు ఉండగా, మధ్యలో హైమాస్ట్ లైటు, పాత శిలాఫలకంతో మరో రోడ్డు విడిపోయి కనిపిస్తుంది. దీంతో ప్రయాణికులు వెళ్లడానికి, రావడానికి గందరగోళానికి గురవుతున్నారు.డివైడరును తొలగించి, రోడ్డును సగ భాగంగా చేసి, మళ్లీ డివైడరు వేయాలి. కానీ పాత డివైడరు ఉంటుండగానే రోడ్డు నిర్మించేశారు.పైగా అక్కడ సీసీ కెమెరాల స్తంభం కూడా ఉంది. దీన్ని తొలగించాల్సి ఉంది. అలాగే గతంలో నిర్మించిన శిలాఫలకం కూడా రోడ్డు మధ్యలోనే ఉంచేశారు. దీంతో ఇక్కడ రోడ్డు రెండుగా విడిపోయింది. అత్యవసరంగా వీటిని తొలగించి, పక్కా ప్రణాళికతో పనులు త్వరితగతిన చేయాల్సి ఉంది. లేకపోతే ఒక్కోసారి వాహనాలు తిన్నగా వచ్చి డివైడరును లేదా శిలాఫలకాన్ని ఢీకొట్టే ప్రమాదం ఉంది. మరోవైపు పనులు మొదలై దాదాపు రెండు నెలలు కావొస్తున్నా, ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ విషయమై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ పాలనలో బీసీలకు సముచిత స్థానం

▸ జయహో బీసీ సదస్సులో ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, జనవరి 25 : టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అన్ని రంగాల్లోనూ మంచి గుర్తింపు ఇచ్చి, సముచిత స్థానం కల్పించామని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం సాయంత్రం తోటగరువులోని ఎర్నిదుర్గమాంబ కల్యాణ మండపంలో 9, 10, 11, 12, 13 వార్డులకు సంబంధించి జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్‌టీ రామారావు సమాజమే దేవాలయం అన్న నినాదంతో పార్టీని స్థాపించారని, అప్పట్లో 25 ఏళ్లకే బీసీ నాయకుడు అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎమ్మెల్యేగా గెలుపొందారని చెప్పారు. మరో బీసీ నాయకుడు ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను అన్ని విధాలా అణగతొక్కుతుందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టాభి, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పదో వార్డు కార్పొరేటర్ మద్ది రామలక్ష్మి, 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి. నాయకులు ఒమ్మి పోలారావు, ఏడువాక పన్యాసిరావు. గాడి సత్యం, తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

గ్రీన్ సిటీగా నగరం అభివృద్ధి : కమిషనర్

వెంకోజీపాలెం, జనవరి 25 : నగరాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి చేయడానికి ప్రపంచ బ్యాంకుకు చెం దిన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. మూడు రోజులుగా ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధి కెల్విన్ బృందం జీవీ ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించింది. ఈమేరకు గురువారం సాయంత్రం కమిషనర్ వారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల పాటు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పలు విభాగాలకు సంబంధించిన అంశాలపై ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ఎకో-వైజాగ్ కార్యక్రమాన్ని చేపట్టామని బృంద సభ్యులకు తెలిపారు. అనంతరం హార్టికల్చర్ విభాగం అర్బన్ గ్రీన్ సోలార్, వేస్ట్ వాటర్ రీసైక్లింగ్ ప్రాజెక్టు, ఈ వెహికల్స్ తదితర అంశాలపై చర్చించారు.



ఐఎఫ్‌సీ బృందంతో చర్చిస్తున్న కమిషనర్

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

వెంకోజీపాలెం, జనవరి 25 : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట రామాలయం వద్ద రూ. 38.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాలువల పనులకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, మేయర్ గొలగాని హరివెంకట కుమారితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, నాగేశ్వరరావు, పల్లా శ్రీను, జీవీఎంసీ అధికారులు, పాల్గొన్నారు.

శారదా పీఠానికి కారుచౌకగా భూములు : బీవీ రామ్

భీమునిపట్నం, జనవరి 25 : పెందుర్తి శారదా పీఠానికి భీమిలిలోని కొత్తవలస కొండపై ప్రభుత్వం కారుచౌకగా కోట్లాది రూపాయల విలువైన భూములను అప్పగించిందని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ విమర్శించారు. గురువారం ఆయన నేరేళ్లవలస దారిలో శారదా పీఠానికి అప్పగించిన భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వరూపానంద సరస్వతికి సీఎం జగన్‌కి మధ్య క్విడ్ ప్రోకో నడించిందని ఆరోపించారు. పీఠానికి ఇచ్చిన 15 ఎకరాల విలువ రూ. 100 కోట్లు వుంటుందన్నారు. ప్రజా సంపదను అతి తక్కువ ధరకు కట్టబెట్టడం దారుణమన్నారు. శారదా పీఠానికి ఏమాత్రం గుర్తింపు లేదని, అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన్ను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎన్టీఆర్ వరల్డ్ వైడ్ ట్రస్ట్ చైర్మన్ ఆడారి ఉమాశంకరరావు, నాయకులు బోడేపూడి దొరబాబు, దువ్వి పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



శారదా పీఠం భూములు చూపిస్తున్న రామ్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

భీమునిపట్నం, జనవరి 25 : ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థినులకు అవగాహన అవసరమని జిల్లా యూత్ ఆఫీసరు జి. మహేశ్వరరావు అన్నారు. గురువారం భీమిలి కేజీబీవీ బాలికలు రోడ్ సేఫ్టీపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి, తదితరులు పాల్గొన్నారు.



స్టెప్ శిక్షణలో పాల్గొన్న డీఈఓ, ఉపాధ్యాయులు

ముగిసిన స్టెప్ శిక్షణ తరగతులు

మధురవాడ, జనవరి 25 : తరగతి గదిలో ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఆంగ్లభాష వినియోగించాలని డీఈఓ ఎల్. చంద్రకళ సూచించారు. మారికవలసలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన స్టాండరైజడ్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ ప్రోఫెషియన్సీ (స్టెప్) శిక్షణ తరగతులు గురువారంతో ముగిసాయి.శిక్షణకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఇంగ్లీషు, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షాభియాన్ అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ. గౌరీశంకర్, మాస్టర్ ట్రైనీలు రైనా, చేతన పాల్గొన్నారు.

గర్వించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి : వీసీ

వెంకోజీపాలెం, జనవరి 25 : ఏయూ గర్వించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు.గురువారం ఆయన ఏయూ స్నాతకోత్సవ మందిరంలో జరిగిన ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడారు. విద్యార్థులు వర్సిటీలో ఉండే రెండేళ్ల కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ చదువుకున్న వారు విభిన్న రంగాల్లో రాణించిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ

ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు రచించిన ఫోషిలాజికల్ ఫర్ స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్ అన్న పుస్తకాన్ని వీసీ ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి ఉపయుక్తంగా విభిన్న కోణాలను స్పృశిస్తూ రచయిత పుస్తకాన్ని రచించారన్నారు.

రోడ్ మార్జిన్ ఆశీలు వసూలుకు వేలం

భీమునిపట్నం, జనవరి 25 : తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో రోడ్ మార్జిన్‌లో ఆశీలు వసూలుకు భీమిలి జోనల్ కార్యాలయంలో గురువారం వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వ పాటను రూ.9లక్షల 77 వేలుగా ప్రకటించగా, వెంకట రామారావు అత్యధికంగా పాట పాడడంతో అతనికి లీజును ఖరారు చేశారు. కాగా భీమిలి రోడ్ మార్జిన్, మునిసిపల్ మార్కెట్‌లో ఆశీలు వసూలుకు నిర్వహించిన పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మళ్లీ వాయిదా వేశారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

భీమునిపట్నం, జనవరి 25 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ సమర్థవంతమైన పాలన ఓటు హక్కుతోనే సాధ్యమవుతుందని చెప్పారు.1950 జనవరి 25న ఎన్నికల సంఘం స్థాపించడంతో ఏటా ఓటర్ల దినోత్సవం జరుపుతున్నామని చెప్పారు. అనంతరం సీనియరు ఓటర్లను సత్కరించారు. యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు అందజేశారు. అలాగే మోడల్ పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి ఓటు వినియోగించుకునే విధానాన్ని వివరించారు. స్థానిక ప్రభుత్వ జూనియరు కళాశాల, డైట్ కళాశాలల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, గంట స్తంభం, పాత బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీవో డా. జానకి, హెచ్‌డీటీ శ్రీనుబాబు, డెప్యూటీ తహసీల్దార్ ఎలక్షన్స్ జె.భాస్కరరావు,ఎంఈవోలు ఎం. శివరాణి, జయప్రద, డైట్ లెక్చరర్ హరిణి, జూనియరు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వేణుగోపాల్, ప్రసాద్, పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఎస్‌వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ సహదేవుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు అప్పలనాయుడు, ఎస్. శ్రీను, పిడి గౌరీశంకర్, లెక్చరర్ వేంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మధురవాడలో...

మధురవాడ/తగరపువలస : మధురవాడ పరిసరాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అలాగే బంగ్లామెట్ట పాఠశాలలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.

పద్మనాభంలో కానరాని జాతీయ ఓటర్ల దినోత్సం

పద్మనాభం : పద్మనాభంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఎక్కడా కానరాలేదు. ఓటర్లను చైతన్యపరచడానికి, ఓటు ప్రాధాన్యతను తెలియజేయడానికి ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించేవారు. ఈసారి మాత్రం అటువంటివి ఏవీ కానరాలేదు. ఈ విషయమై తహసీల్దారు వేణుగోపాల్‌ను సంప్రతించగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమానికి తాను హాజరయ్యానని తెలిపారు. కాగా ఓటర్ల తుది జాబితాలు ప్రకటించిన నేపథ్యంలో ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు పోలింగు కేంద్రాల్లో అందుబాటులో ఉండాల్సిన బీఎల్‌ఓలు ఎక్కడా కనిపించడం లేదని పలువురు నాయకులు చెబుతున్నారు.

లెక్చర్ సీరీస్ పోస్టర్ ఆవిష్కరణ

వెంకోజీపాలెం, జనవరి 25 : ఏయూ గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే లెక్చర్ సీరిస్ పోస్టర్‌ను వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య సమత, రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకుడు సీతామాణిక్యం పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

పద్మనాభం, జనవరి 25 : మండలంలో శుక్రవారం జరిగే గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, పోలీసు స్టేషన్ తదితర చోట్ల పోల్‌లు, జెండాలను సిద్ధం చేశారు.



ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా

భీమునిపట్నం, జనవరి 25 : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పింఛనుదారులు గురువారం ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తట్టికోట భీమారావు, ముంజేరు ఆనందరావు మాట్లాడుతూ 2018 జూలై నుంచి ఇప్పటివరకు డీఆర్ బకాయిలు మంజూరు చేయాలని, ప్రతి నెలా 1న పింఛను బట్వాడా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 11వ పీఆర్‌సీ బకాయిలతో పాటు పే ఫిక్సేషన్ స్టేట్‌మెంట్ ఇవ్వాలని, 12వ పీఆర్‌సీ నియమించి, ఐఆర్ ప్రకటించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం కోశాధికారి పి. రామకృష్ణ, నాయకులు బొట్ట గురుమూర్తి, మీసాల మహేశ్వరరావు, నాగిరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి

సింహాచలం, జనవరి 25 : వరాహలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సత్యప్రభాకర్ గురువారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



కప్పస్తంభం వద్ద సత్య ప్రభాకర్ దంపతులు

రామయ్య సన్నిధిలో పునర్వసు నక్షత్ర హవనం

సింహాచలం, జనవరి 25 : సింహగిరిపై ఈశాన్య దిక్కులో గంగధార సమీపాన ఉన్న సీతారామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్ర హవనాన్ని గురువారం సంప్రదాయబద్ధంగానిర్వహించారు. ప్రభాత సేవల అనంతరం ఉత్సవమూర్తి చక్ర పెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై ఉంచారు. మండపారాధన, కలశారాధన, బింబారాధన జరిపి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. అనంతరం పంచసూక్తాలు, రాషడక్షరీ మంత్రంలో సంక్షిప్త రామయణాలను పఠిస్తూ హవనాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి సతీసమేతంగా పాల్గొన్నారు.



హవనం చేస్తున్న రుత్వికులు

గెజిటెడ్ అధ్యాపకుల సంఘం డైరీ ఆవిష్కరణ

భీమునిపట్నం, జనవరి 25 : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం డైరీని భీమిలి ప్రభుత్వ ఎస్‌వీఎల్ఎన్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా సంఘం అధ్యక్షుడు సీహెచ్ విష్ణుమూర్తి, విజయనగరం జిల్లా సంఘం కోశాధికారి బి. ప్రసాదరావు, అధ్యాపకులు బి. సహదేవుడు, డి. మాధురి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు



తగరపువలస, జనవరి 25 : సంగివలస ఎన్ఆర్ఐ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న సీర శ్రావణి (22) రెండు రోజులుగా కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు గురువారం రాత్రి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కనపరాజుపేట గ్రామానికి చెందిన శ్రావణికి ఆరు నెలలు క్రితం అదే జిల్లా గోపాలరాజుపురం గ్రామానికి చెందిన త్రినాథరావుతో వివాహం జరిగింది. అప్పటి నుంచి భర్త వద్దే ఉంటోంది. రెండు నెలలు క్రితం సంగివలస అనిట్సు నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ కోర్సులో చేర్పించగా ఇక్కడ ఉండి చదువుతోంది. ఈనెల 22 నుంచి ఆమె కళాశాలకు రావడం లేదని యాజమాన్యం చెప్పడంతో కుటుంబీకులు ఇక్కడికి వచ్చి వాకబు చేశారు. భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్టు తమకు గతంలోనే కుమార్తె సమాచారం ఇచ్చిందని, ఆ కారణంగానే పారిపోయి ఉంటుందని ఆమె తల్లి జయలక్ష్మి తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ డి. రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌డీ ప్రి టాక్ నిర్వహణ

వెంకోజీపాలెం, జనవరి 25 : ఏయూలోని ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న పీహెచ్‌డీ ప్రి టాక్ గురువారంతో ముగిసింది. చివరి రోజు వీసీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు జారీ చేశారు. ఏయూ ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్ కోర్సుల్లో తొమ్మిది విభాగాలకు చెందిన 20 మందికి ప్రి టాక్ నిర్వహించారు.

జల జీవన్ మిషన్ పనులకు భూమి పూజ

పద్మనాభం, జనవరి 25 : మద్ది గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న మంచినీటి పథకానికి ఎంపీపీ కె. రాంబాబు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం మంజూరు చేసిన నిధులు రూ. 19 లక్షలతో పథకాన్ని నిర్మించి ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామన్నారు.